

మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ బహిష్కృత నాయకుడు బక్క జడ్సన్

ప్రశ్నిస్తున్నందుకే నాపై సస్పెన్షన్ వేటు

పంజాగుట్ట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): 'తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత పది సంవత్సరాల పాటు జరిగిన దోపిడీపై నిరంతరం ఉద్యమించా. కాంగ్రెస్ ఐడియాలజీని పాటిస్తూ.. పూర్తిగా పార్టీ అర్గనైజేషన్‌కు అంకితమయ్యా. ప్రశ్నిస్తున్నందుకే నాపై సస్పెన్షన్ వేటు వేశారు' అని కాంగ్రెస్ పార్టీ బహిష్కృత నాయకుడు బక్క జడ్సన్ ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్‌లకు లాభం చేయడానికే రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని, బీజేపీ అత్యధిక సీట్లు గెలవాలని ఆయన కంకణం కట్టుకున్నారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కేసీఆర్ రైతులకు రైతుబంధు పథకం కింద ఇవ్వాలని పెట్టిన రూ.7వేల కోట్లను ప్రస్తుత సీఎం ఏమి చేశారని, ఇప్పటి వరకు కాంగ్రెస్ బ్యానర్ కింద చేసిన ఉద్యమాలను కొనసాగించడానికే తెలంగాణ వనరుల రక్షణ సమితిని ఏర్పాటు చేసినట్లు ఆయన ప్రకటించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తన సస్పెన్షన్, భవిష్యత్ కార్యక్రమాలపై ఆయన మాట్లాడారు. తనకు క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి వివరణ ఇవ్వాలని నోటీస్ ఇచ్చారని, ఫిర్యాదులు ఏమిటో చెప్పాలని అడిగినా.. అప్పటికే తీసుకున్న నిర్ణయం ప్రకారం తనను సస్పెండ్ చేశారన్నారు. వివిధ శాఖల్లో నిధుల దుర్వినియోగంపైన ఈడీకి, సీబీఐకి, కొందరి రాజకీయ నేతల అవినీతిపై తను చేసిన ఎన్నో ఫిర్యాదుళ గురించి వివరించారు. ప్రాణ భయం, రాజకీయ భవిష్యత్‌పై ఆశ వదిలేసి కల్వకుంట్ల కుటుంబంపై పోరాటం చేశానన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే ఓటు వేస్తా, వేయిస్తా అని అన్నారు. నేను ఎవరి చేతుల్లో ఆయుధం కాదన్నారు. అన్నింటిపైన ప్రశ్నిస్తున్న తనను సస్పెండ్ చేశారని, అయినా కూడా పార్టీమారే పరిస్థితి లేదన్నారు.



ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులను అభినందిస్తున్న సీపీ శ్రీనివాస్‌రెడ్డి

మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సీపీ

● ప్రతిభ కనబరిచిన పోలీసులకు రివార్డులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి బుధవారం మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని గోషామహల్ పోలీస్ డివిజన్ ఆధ్వర్యంలో ఎన్నికల విధులు నిర్వహిస్తూ.. మోడల్ కోడ్ ఆఫ్ కండక్టులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులు అసిస్టెంట్ ట్రైనీ ఇన్‌చార్జి అధికారి శంకర్, చంద్రశేఖర్ (ఏఎస్ఐ చత్రినాక), కానిస్టేబుళ్లు తరుణ్, సందీప్, ప్రవీణ్‌లను అభినందించి రివార్డులు అందజేశారు. ఆయన వెంట సౌత్ వెస్ట్ డీసీపీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, గోషామహల్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ మహేష్, ఇతర సిబ్బంది ఉన్నారు.


సే నోప్లాస్టిక్ - సేవ్ ఎర్త్ స్టిక్కర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రముఖ సినీ నటుడు సుమన్

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

పంజాగుట్ట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రముఖ సినీ నటుడు సుమన్ తల్వార్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అభయ బంజారా ఆధ్వర్యంలో బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సే నో ప్లాస్టిక్ - సేవ్ ఎర్త్ స్టిక్కర్ ను లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అభయ బంజారా అధ్యక్షుడు లయన్ కె.శ్రీనివాసులు, అల్వాల్ ఓజోన్ హాస్పిటల్స్ ఎండీ దీప్తి, సీఓఓ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావుతో కలిసి ఆవిష్కరించారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి దరిత్రిని కాపాడుకుందామని సినీనటుడు సుమన్ అన్నారు. ప్రకృతి, నీరు చాలా ముఖ్యమని వాటిని సంరక్షించుకుందామన్నారు. ప్లాస్టిక్‌వల్ల కలిగే అనర్థాలను ఆయన వివరించారు. కరోనా చనిపోలేదని రూపాలు మార్చుకుంటూ మన మధ్య నే తిరుగుతుందని, అందరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. చిన్న, పెద్దా అనే తేడా లేకుండా పాఠశాలకు వెళ్తున్న వారు కూడా గుండెపోటుతో మృతి చెందుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తన అనుభవాలను ఆయన పంచుకున్నారు. గడిచి న తొమ్మిది సంవత్సరాలుగా పలు అవగాహన, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అభయ బంజారా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు తెలిపారు. సమావేశంలో లయన్స్ క్లబ్ సభ్యులు జి.నరసింహారావు, గోపీకృష్ణ, మురళీకృష్ణ, ఎస్.కోటేశ్వరరావు, పీఎస్ఎన్ రాజు, పద్మజ, సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

సినీ కళాకారులకు 'మనం సైతం' ఆర్థిక సహాయం


ఆర్థిక సహాయం అందజేస్తున్న మనం సైతం నిర్వాహకుడు కిరణ్

బంజారాహిల్స్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): అనారోగ్యం బారిన పడి ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న సినీ కళాకారులకు 'మనం సైతం' ఆర్థిక సహాయం అందజేసింది. కిడ్నీ సమస్యతో బాధపడుతున్న సినీ సౌండ్ ఇంజనీర్ శ్రీనివాస్‌కు, హృద్రోగంతో బాధపడుతున్న సినీ రచయిత భరత్‌కుమార్, అనారోగ్యం బారిన పడ్డ విలేకరి రవికుమార్ కుటుంబీకులకు మనం సైతం నిర్వాహకుడు కాదంబరి కిరణ్ మంగళవారం 25 వేల రూపాయల చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా కాదంబరి కిరణ్ మాట్లాడుతూ.. సినీ పరిశ్రమలో పనిచేస్తున్న పేద కార్మికులకు, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలకు సహాయం చేసేందుకు మనం సైతం ఏర్పడిందన్నారు. ఇప్పటి వరకు అనేక మంది కళాకారులకు సహాయం అందజేసినట్టు తెలిపారు.

175 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

బోరబండ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ప్రజా పంపిణీ (పీడీఎస్) ద్వారా తెల్ల రేషన్ కార్డుదారులకు అందించే బియ్యాన్ని అక్రమంగా ఓ ఆటోలో తరలిస్తుండగా బోరబండ పోలీసులు పట్టుకున్నారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో బోరబండ బస్టాప్‌లో బుధవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. సైట్-3కి చెందిన కె.శ్యామ్ సన్‌రాజ్ నంబర్ ప్లేట్ లేని ఓ ట్రాలీ ఆటోలో 13బస్తాల్లో 175కిలోల రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్టు గుర్తించారు. ఆటోలో తరలిస్తున్న బియ్యానికి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో బియ్యం, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

4 కిలోల గంజాయి పట్టుకున్న పోలీసులు

బోరబండ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రెండు లక్షల విలువ చేసే 4 కిలోల గంజాయిని బోరబండ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. రాజ్‌నగర్‌కు చెందిన హరేంద్ర మోహన్ ఖాన్(50), ఎస్ఆర్‌టీ నగర్‌కి చెందిన పర్వేశ్ ఖాన్(37), సైట్-2కి చెందిన అనిల్ కుమార్ గుప్తా(40) ముగ్గురు నుంచి సుమారుగా 2 లక్షల విలువ చేసే గంజాయి స్వాధీనం చేసుకున్నారు. హరేంద్ర మోహన్ ఖాన్ ఇంట్లో దాడులు నిర్వహించిన పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు. బోరబండ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ భూపాల్ గౌడ్‌తో పాటు టాస్క్ ఫోర్స్ పోలీసులు ఈ దాడుల్లో పాల్గొన్నారు.


ఓటీపీ, పెట్టుబడి, జాబ్, ఫెడెక్స్, సోషల్ మీడియా సైబర్ నేరాలపై ఎస్ఆర్‌నగర్ ప్రాంతంలోని హాస్టల్స్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు
- హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి)

'అడవిలో ఒక రోజు'

అది నల్లమల అడవి ప్రాంతం.. దట్టమైన అరణ్యం.. అక్కడ గిరిజనులు జీవిస్తుంటారు.. సరైన జీవనోపాధి లేక పిల్లలకు చదువు కూడా చెప్పించే వీలు లేక కొన్ని దశాబ్దాలుగా అడవిలోనే మగ్గుతున్న కుటుంబాలు. అలాంటి వారికి చేయూతనందించడానికి విద్యుత్ ఉద్యోగులు ముందుకొచ్చారు. నగరానికి చెందిన కొందరు విద్యుత్ ఉద్యోగులు సోషల్ రెస్పాన్సిబిలిటీ టీంను ఏర్పాటు చేసుకొని గిరిజనులకు తమ వంతు సహాయాన్ని అందజేస్తున్నారు. ఇప్పటివరకు 9 విడతలుగా నల్లమల ఫారెస్ట్ అమ్రాబాద్ రిజర్వ్ ఫారెస్ట్‌లోని 9 పెంటలలో (చిన్నగ్రామాలు) గృహోపకరణాలు, నిత్యావసరాలు అందించారు.
- ఎర్రగడ్డ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి)

● నల్లమల గ్రామాల్లో సోషల్ రెస్పాన్సిబిలిటీ టీం ద్వారా సేవ
● ఇప్పటి వరకు తొమ్మిది విడతలుగా 235 కుటుంబాలకు సహాయం


మేడిమాకల చెంచుపెంటలో గృహోపకరణాలతో గిరిజనులు, ఉద్యోగులు

నగరంలోని విద్యుత్ సౌదాలో అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎర్రగడ్డకు చెందిన సంఘ సంస్కర్త కళ్లెం శ్రీనివాస్ రెడ్డి పలు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. తన వేతనంలో నుంచి 20శాతం సేవా కార్యక్రమాలకు కేటాయిస్తుంటారు. అదేవిధంగా తోటి ఉద్యోగులలో 150మందిని సోషల్ రెస్పాన్సిబిలిటీ టీం సభ్యులుగా ఏర్పడి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గతంలో విద్యుత్ సౌదాలలో విజిలెన్స్ ఎస్సైగా పనిచేసిన వీరబాబు బదిలీపై నాలుగేళ్ల కిందట అమ్రాబాద్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా వెళ్లారు. ఆయన ద్వారా నల్లమల అడవుల్లో గిరిజనుల దీనస్థితిని కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి తెలుసుకున్నారు. వారికి ఏదైనా చేయాలని సోషల్ రెస్పాన్సిబిలిటీ టీం ద్వారా గిరిజనులకు గృహోప్రకారణాలు, నిత్యావసరాలు అందిస్తున్నారు.


గిరిజనులకు అందించిన గృహోపకరణాలు

ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే..

వారి అవసరాలను తెలుసుకోవడానికి అమ్రాబాద్ రిజర్వ్ ఫారెస్ట్‌లోని 9 పెంటలకు సర్పంచ్ బాలగురవయ్యను సంప్రదించి గృహోపకరణాలు, నిత్యావసర వస్తువులను అందజేస్తున్నారు. 9 పెంటలలో ఉన్న చిన్నారులకు అవసరమైన ఆట బొమ్మలు, క్రీడా పరికరాలు కూడా అందజేశారు. ఉద్యోగులకు సెలవు దినమైన ఏదో ఒక ఆదివారం అక్కడికి వెళ్లి వారికి సహాయ సహకారాలు అందిస్తూ ఉదయం నుంచి సాయంత్రం వరకు వారితోనే గడిపి వారి అవసరాలు, బాగోగులు, చూస్తున్నారు.

2023 నుంచి సేవ..

సోషల్ రెస్పాన్సిబిలిటీ టీం సభ్యులు 2023 సంవత్సరం జనవరి 26న 'అడవిలో ఒకరోజు' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటివరకు 9 పెంటలలో 235 కుటుంబాలకు సుమారు రూ. 9 లక్షల విలువ చేసే గృహోపకరణాలు, నిత్యావసరాలు, పిల్లలకు ఆట వస్తువులు తదితరాలను అందజేశారు. అక్కడి పిల్లలకు విద్యాభ్యాసం చెప్పించె మరో కార్యక్రమానికి త్వరలో శ్రీకారం చుట్టనున్నారు.

సేవ చేయడం ఇష్టం

కొంత సమయం దొరికితే సేవా కార్యక్రమాలకు కేటాయిస్తాను. నల్లమల అడవుల్లో గిరిజనుల దుస్థితి చూసి చలించిపోయాను. వారి సాధక బాధలు తెలుసుకొని వారికి సేవ చేయాలన్న ఉద్దేశంతో సోషల్ రెస్పాన్సిబిలిటీ ద్వారా సహాయం అందిస్తున్నాను.
- కళ్లెం శ్రీనివాస్ రెడ్డి, సంఘసంస్కర్త

సోషల్ రెస్పాన్సిబిలిటీ టీం సేవ అపారమైనది

నల్లమల్ల అడవిలో ఉన్న చెంచులకు సరైన వసతులు లేక కొన్ని సంవత్సరాల నుంచి జీవనం సాగిస్తున్నారు. వారి గురించి హైదరాబాద్‌లో విద్యుత్ సౌదాలో అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్‌గా పని చేస్తున్న కళ్లెం శ్రీనివాస్ రెడ్డికి చెప్పాను. వారు తమ మిత్ర బృందంతో నల్లమల్ల అడవిలో ఒక గ్రామానికి సహాయం చేస్తారని అనుకుంటే మొత్తం నల్ల మల్లలో ఉన్న అన్ని చెంచు పెంటలకు సహాయం చేస్తూనే ఉండడం చాలా సంతోషం.
- వీరబాబు, సబ్ ఇన్స్పెక్టర్, అమరాబాద్ పోలీస్ స్టేషన్

మాదిగలకు ఎంపీ సీటు ఇవ్వకుండా మోసం


సమావేశంలో మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్

రాంనగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఒక్క ఎంపీ సీటు కూడా మాదిగలకు ఇవ్వకుండా కాంగ్రెస్ మోసం చేసిందని టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ అన్నారు. బుధవారం విద్యానగర్‌లో ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగలకు ఎంపీ సీట్ల కేటాయింపులో కాంగ్రెస్ చేసిన మోసాన్ని ఎండగడుతూ పార్టీ అభ్యర్థులు, మంత్రులను అడ్డుకుని చావుడప్పు కొడుతూ నిరస న కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కడియం శ్రీహరి మాదిగలను మోసం చేశారని, ఆయనను కాంగ్రెస్‌లో ఎలా చేర్చుకున్నారని, ఏనాడూ తెలంగాణ, మాదిగ దండోరా ఉద్యమంలో పాల్గొనని కడియం కావ్యకు వరంగల్ ఎంపీ సీటు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ఆంధ్రకు చెందిన వ్యక్తిని వివాహం చేసుకున్న కావ్యకు తెలంగాణతో సంబంధం లేదన్నారు. కడియం శ్రీహరి తన కుమార్తెను పోటీ నుంచి తప్పించకపోతే ఆయన ఇంటి ఎదుట చావు డప్పు మోగిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవాలతోనే సరి

● కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్ ఆరోపణ


మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్, చిత్రంలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

బంజారాహిల్స్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): సింటెక్స్ ట్యాంకులు, పవర్ బోర్ల ప్రారంభోత్సవాలకే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పరిమితమయ్యారని సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్ ఆరోపించారు. పార్లమెంట్ పరిధిలో ఏ నియోజకవర్గానికి కూడా కనీసం కోటి రూపాయలు కేటాయించలేదని విమర్శించారు. జూబ్లీహిల్స్ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ జూబ్లీహిల్స్ నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ... నీటి సమస్య తలెత్తినప్పుడు తన అసెంబ్లీ నియోజకవర్గంలో సొంత నిధులతో వంద పవర్ బోర్లను ఏర్పాటు చేశామని, ఎప్పుడూ హడావిడి చేయలేదన్నారు. ఐదు సంవత్సరాలు ఎలాంటి పనులు చేప ట్టకుండా కాలం వృథా చేసిన కేంద్రమంత్రి ఇప్పుడు పవర్ బోర్లంటూ హడావిడి చేస్తున్నారన్నారు. సికింద్రాబాద్ అసెంబ్లీ పరిధిలోని మండల కార్యాలయం వద్ద పది వేల రూపాయల నిధులతో షెడ్డు ఏర్పాటు చేసి దాని ప్రారంభోత్సవానికి హడావిడి చేయడం బీజేపీ నాయకులకే దక్కిందన్నారు. ఇలాంటి నాయకులను మరో సారి నమ్మి ప్రజలు మోసపోవద్దని పద్మారావు గౌడ్ హితవు పలికారు. కాంగ్రెస్‌కు అభ్యర్థులు లేక బీఆర్ఎస్ నుంచి తీసుకొని మరీ టికెటు ఇస్తున్నారని, బీఆర్ఎస్‌తోనే సురక్షిత పాలన సాధ్యమవుతుందని ప్రజలు ఇప్పుడూ నమ్ముతున్నారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలకే నీటి కరువు మొదలైందని, విద్యుత్ కోతలు తీవ్రమయ్యాయని ఆరోపించారు. ప్రణాళికా లేకుండా పాలన సాగించి ఇప్పుడు నీటి కొరతకు కారణం బీఆర్ఎస్ అని పాలకులు ఆరోపించడంలో అర్థం లేదన్నారు. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మాట్లాడుతూ.. ప్రజల మనిషిగా పద్మారావుగౌడ్‌కు రాష్ట్రంలో మంచి గుర్తింపు ఉందని, ఉద్యకారుడైన ఆయనకు బీఆర్ఎస్ సికింద్రాబాద్ పార్లమెంట్ టికెట్ కేటాయించిందని అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్‌లో బీఆర్ఎస్ జెండా ఎగురవేసి పార్టీకి తిరుగు లేదని నిరూపించేందుకు పార్టీ శ్రేణులు ఒక తాటి మీదకు రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కార్పొరేటర్లు దేదీప్యరావు, రాజ్‌కుమార్ పటేల్, వివిధ డివిజన్‌ల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

'మాలల ఎదుగుదలకు అడ్డుపడుతున్న మంద కృష్ణ'

బంజారాహిల్స్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మాదిగలు, మాలలు సమానంగా ఉన్నారని, ఈవిషయాన్ని గుర్తించకుండా మంద కృష్ణ మాదిగ మభ్యపెట్టి ప్రజలను, రాజకీయ పార్టీలను మోసం చేస్తున్నారని రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్ ఆరోపించారు. తమ స్వార్థం కోసం మాలల ఎదుగుదలకు అడ్డం పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బంజారాహిల్స్ మాల సంఘాల కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... 30సంవత్సరాల నుంచి మాల మాదిగలను రాజ్యాధికారానికి దూరం చేసిన దౌర్భాగ్యం మంద కృష్ణదేనని, ఓటు బ్యాంకు రాజకీయం చేసి మాదిగల ఆత్మగౌరవాన్ని కోట్ల రూపాయలకు బీజేపీకి తాకట్టు పెట్టారన్నారు. బీజేపీ ఏజెంటుగా ఉంటూ, మాలల గురించి మాట్లాడే అర్హత మందకృష్ణ మాదికకు లేదన్నారు.

ఓటింగ్ శాతం పెంపుపై ఈసీఐ ప్రత్యేక దృష్టి

● రైల్వేశాఖ, పెట్రోలియం సంస్థలతో ఒప్పందం

హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు భారత ఎన్నికల సంఘం(ఈసీఐ) ప్రత్యేక దృష్టి సారించింది. ఓ వైపు స్వీప్ (సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ ప్రోగ్రామ్) ఓటు ప్రాముఖ్యతపై క్షేత్రస్థాయిలో ప్రచారం చేస్తూనే.. రైల్వేశాఖ, పెట్రోలియం సంస్థల ద్వారా కూడా విస్తృత ప్రచారం నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది.. ఈక్రమంలో రైల్వేశాఖతోపాటు, పెట్రోలియం సంస్థలతో ఈసీఐ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సంస్థల ద్వారా చేపట్టే ఓటరు అవగాహనా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను సీఈఓ వికాస్‌రాజ్ బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. రైల్వే పెట్రోలియం సంస్థల్లో ఓటరు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. రైల్వే, పెట్రోలియం సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న ఇండియన్ సిల్క్ గ్యాలరీ


వస్త్రాలను తిలకిస్తున్న సందర్శకులు

బంజారాహిల్స్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): బానుడి ప్రతాపం చూపిస్తున్నాడు. మరో వైపు శుభకార్యాలు, వివాహాలు. ఈ తరుణంలో కాస్త చల్లదనం పంచడంతో ఫ్యాషనబుల్‌గా ఉండే ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. ఈనేపథ్యంలో శ్రీనగర్‌కాలనీ ఇండియన్ సిల్క్ గ్యాలరీ ప్రదర్శన మొదలైంది. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, కాంతావర్క్, హ్యాండ్ బ్లాక్, ప్రింటెడ్ శారీస్, లినెన్ శారీస్, కలంకారి, బెంగాల్ కాటన్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ జాకెట్‌లు, లక్నోచికాన్, బనారస్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జువెలరీ వంటివి మహిళలను విశేసంగా ఆకట్టుకుంటున్నాయి. దేశ వ్యాప్తంగా 14 నగరాలకు చెందిన చేనేత కారులు తమ ఉత్పత్తులను 70కి పైగా స్టాల్స్‌లో పెట్టి వినియోగదారులకు అందుబాటులో ఉంచారు. ప్రదర్శన ప్రవేశ ఉచితం అని నిర్వాహకులు తెలిపారు. ఏప్రిల్ 7 వరకు ప్రదర్శన కొనసాగుతుందని నిర్వాహకులు చెప్పారు.


ఇఫ్తార్‌కు హాజరైన మాజీ డిప్యూటీ మేయర్ బాబా

ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీక

బోరబండ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఇఫ్తార్ విందులు ప్రజల మధ్య మత సామరస్యాన్ని పెంపొందిస్తాయని మాజీ డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ మహ్మద్ బాబా ఫసియుద్దీన్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో జరిగిన ఇఫ్తార్ విందుల్లో బాబా పాల్గొన్నారు. రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉన్న మైనార్టీలకు ఇచ్చే ఇఫ్తార్ ప్రేమపూర్వక విందులన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ యువ నాయకులు, మైనార్టీ యువత పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం వద్ద మజ్జిగ పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

ఖైరతాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణపతి ప్రాంగణం వద్ద చలివేంద్రం ఏర్పాటైంది. బుధవారం దీనిని ఉత్సవ కమిటీ కన్వీనర్ సందీప్‌రాజ్ ప్రారంభించి బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఉచిత కంప్యూటర్ శిక్షణా శిబిరంలో శిక్షార్థులైన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జలమండలి సహకారంతో ప్రతిరోజూ ఇక్కడ చల్లటి తాగు నీరు అందజేస్తామని ఉత్సవ కమిటీ కార్యదర్శి సింగరి రాజ్‌కుమార్, బీజేపీ నాయకురాలు వీణా మాధురి తెలిపారు.


రంజాన్ పండుగ రోజు ఈద్గా ప్రార్థనల ఏర్పాట్ల కోసం రహ్మత్‌నగర్ ఎస్పీఆర్ హిల్స్ ప్లేగ్రౌండ్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, నాయకులు పి.సాయిలు, ఇక్బాల్ తదితరులు
- యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి)

జేఎన్‌టీయూ పరీక్షల విభాగంలో గందరగోళం

● ఫలితాల కోసం విద్యార్థుల ఎదురుచూపు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీ పరీక్షల విభాగంలో మరోమారు గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. గతంలో మూడో ఏడాది బీటెక్ విద్యార్థుల ఫలితాల్లో గందరగోళ పరిస్థితులు ఏర్పడగా, ప్రస్తుతం మొదటి సంవత్సరం విద్యార్థులు అదే తరహా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మొదటి సెమిస్టర్ పరీక్షలు బాగా రాసినప్పటికీ కొందరు విద్యార్థులకు సంబంధించి.. రిజల్ట్ ప్రాసెసింగ్‌లో లోపాలు తలెత్తినట్లు తెలిసింది. ఈ కారణంగా ఎక్కువమంది విద్యార్థులకు సున్నా మార్కులు వచ్చినట్లు మెమోల్లో కనిపిస్తున్నట్లు సమాచారం. సెమిస్టర్ పరీక్షలు పూర్తయి రెండు నెలలవుతున్నా ఫలితాలు రాకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతుండగా, లోపాలను సరిదిద్దలేని పరిస్థితుల్లో పరీక్షల విభాగం అధికారులకు ఏం చేయాలో దిక్కుతోచడం లేదు. గతానికి భిన్నంగా ఈ ఏడాది పరీక్షల మూల్యాంకనం విధానంలో తెచ్చిన మార్పులే ఈ పరిస్థితికి కారణంగా తెలుస్తోంది. గతంలో వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన ప్రొఫెసర్ నర్సింహారెడ్డి ప్రస్తుతం కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్నారు. ఈయన పరీక్షల విభాగానికి ఇన్‌చార్జ్‌గా ఉన్నపుడు.. ఆన్సర్ బుక్‌లెట్ వారీగా మూల్యాంకనం బదులు ప్రశ్నల వారీగా మూల్యాంకన విధానాన్ని ప్రవేశపెట్టారు.

ఆన్‌డ్యూటీలో ప్రిన్సిపాల్ బిజీబిజీ

మూల్యాంకన విధానంలో మార్పుల గురించి కొత్తగా వచ్చిన వైస్‌ప్రిన్సిపాల్‌కు గానీ, పరీక్షల విభాగం అధికారులకు గానీ అవగాహన లేకపోవడంతో సకాలంలో ఫలితాలు ఇవ్వలేక సతమవుతున్నారు. కొత్త విధానంపై అవగాహన ఉన్న ప్రిన్సిపాల్.. 2,500 మంది విద్యార్థుల సమస్యను గాలికి వదిలేసి, పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల నిర్వహణ పనుల్లో మునిగిపోయారని విద్యార్థి సంఘాల ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. కీలక బాధ్యతల్లో ఉన్న అధికారికి ఆన్‌డ్యూటీలో టీఎస్‌పీఎస్సీ బాధ్యతలు అప్పగించడం ఎంతవరకు సబబని ప్రశ్నిస్తున్నారు. ప్రిన్సిపాల్ అందుబాటులో ఉండకపోవడంతో పరీక్షల విభాగం అధికారులు, కళాశాలలో చదువుతున్న సుమారు 8,500 మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. యూనివర్సిటీ ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థుల బాగోగులను పట్టించుకునే ప్రొఫెసర్‌ను ప్రిన్సిపాల్‌గా నియమించాలని డిమాండ్ చేస్తున్నారు. ఫస్టియర్ ఫలితాలను సకాలంలో విడుదల చేయలేకపోవడంపై ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా, ప్రిన్సిపాల్ కాలేజీయేతర (ఆన్‌డ్యూటీ) పనుల్లో బిజీగా ఉన్నట్లు సిబ్బంది తెలిపారు.

అడ్డగుట్టలో చెత్తకుప్పలు

● రాత్రి అయిందంటే చాలు దుర్వాసన, విజృంభిస్తున్న దోమలు

అడ్డగుట్ట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ అడ్డగుట్ట డివిజన్‌లో పలు కూడళ్ల వద్ద ఎక్కడపడితే అక్కడ చెత్త పేరుకుపోవడంతో కాలనీ బస్తీవాసులు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ డివిజన్‌లో చెత్త కుండీలు లేకపోవడంతో రోడ్లపైనే చెత్త పారేయడంతో స్థానికులు వివిధ వ్యాధులకు గురవుతున్నారు. ఉదయం 11గంటలకే జీహెచ్‌ఎంసీ సిబ్బంది విధుల్లో ఉన్నప్పటికీ మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ప్రధాన కూడళ్ల వద్ద చెత్త పేరుకుపోవడంతో రాత్రి సమయంలో కాలనీ బస్తీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేయడం కాలనీ, బస్తీలకు అనుకూలంగా చెత్తకుండీలు లేకపోవడం కారణంగా రాత్రి సమయంలో చెత్తపారేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయాన్నే వీధిలోకి చేరుతున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది శుభ్రం చేస్తున్నప్పటికీ మధ్యాహ్నం సమయంలో మళ్లీ చెత్త పేరుకుపోతుందని, చాలామందికి ఇక్కడ చెత్త వేయవద్దని చెబితే కూడా కాలనీ, బస్తీవాసులు వినిపించుకోవడంలేదని, జీహెచ్‌ఎంసీ సిబ్బంది సూచించినప్పటికీ మరెక్కడ చెత్త వేయాలో చెప్పాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అడ్డగుట్ట ఢిల్లీ పబ్లిక్ స్కూల్, అడ్డగుట్ట డివిజన్ కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి ఇంటికి కూతవేటు దూరం, తుకారాంగేట్ సాయిబాబా ఆలయానికి వెళ్లే దారిలో నిత్యం పేరుకుపోతున్న చెత్త కనిపిస్తుంది. వీటిని తొలగించడంలో సిబ్బంది నిర్లక్ష్యం చేస్తున్నారంటూ పలు ఆరోపణలు వస్తున్నాయి.


అడ్డగుట్ట కార్పొరేటర్ ఇంటికి కూతవేటు దూరంలో పేరుకుపోయిన చెత్త, మురికి నీరు


తుకారాంగేట్ సాయిబాబా ఆలయానికి వెళ్లే మార్గంలో పేరుకుపోయిన చెత్త

ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలి



అడ్డగుట్ట డివిజన్‌లో ప్రధాన కూడళ్ల వద్ద చెత్త కుండీలు లేకపోవడంతో చెత్త పేరుకుపోతుంది. చెత్తను తొలగించడంలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది విఫలమవుతున్నారు. డ్యూటీ సమయంలోనే చెత్త వేయకుండా చూస్తున్నప్పటికీ శాశ్వత పరిష్కారం లేకపోవడం కారణంగానే చెత్త పేరుకుపోతుంది.
- బక్కూరి నర్సింగ్ రావు

చెత్త కుండీలను ఏర్పాటు చేయాలి



అడ్డగుట్ట డివిజన్‌లో ఎక్కడా కూడా చెత్త కుండీలు లేకపోవడం కారణంగానే ప్రజలు రోడ్లపై వేస్తున్నారు. అయినప్పటికీ ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాల్సిన జీహెచ్‌ఎంసీ సిబ్బంది ఉదయం 11 గంటలు, లేదంటే మధ్యాహ్నం 1 గంట వరకు ఆయా ప్రాంతాల్లో శుభ్రం చేస్తున్నారు. కానీ మధ్యాహ్నం నుంచి మధ్య రాత్రి వరకు ప్రజలు రోడ్లపై చెత్త వేయడంతో కాలనీ బస్తీలో చెత్తపేరుకుపోతుండడం వల్ల విపరీతమైన దోమలు వ్యాపిస్తున్నాయి. వెంటనే సమస్యను పరిష్కరిస్తే బాగుంటుంది.
- దేవమ్మ, తుకారాంగేట్

చెత్త రోజు కనిపిస్తోంది



అడ్డగుట్ట డివిజన్‌లో ఎక్కడ చూసినా చెత్త కనిపిస్తోంది. ఉదయం వేళలో విధుల్లో ఉన్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది తొలగించి వెళ్లిపోతున్నారు. కానీ సాయంత్రం సమయంలో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయడం దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన చౌరస్తాలో కాలనీ బస్తీకి దూరంగా ఖాళీ ప్రదేశాల్లో చెత్తకుండీలు ఏర్పాటు చేస్తే బాగుంటుంది. లేదంటే రోగాల బారిన పడాల్సిందే. ఇంటింటికీ చెత్తను తీసుకెళ్లే ఆటో ట్రాలీలు వచ్చినప్పటికీ ప్రజలు చెత్త ట్రాలీలో వేయకుండా రోడ్లపైనే వేస్తున్నారు. ఎక్కడ ఖాళీ ప్రదేశం కనిపిస్తే అక్కడ చెత్తవేయడంతో ఇబ్బందిగా మారుతుంది. ఇప్పటికైనా ప్రధాన కూడళ్ల వద్ద చెత్త కుండీలను ఏర్పాటు చేస్తే బాగుంటుంది.
- సుమలత, తుకారాంగేట్



ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న నెహ్రూ యువ కేంద్రం హైదరాబాద్ జిల్లా యూత్ ఆఫీసర్ ఖుష్బూ గుప్తా, కళాశాల డైరెక్టర్ ప్రొ. కె.విజయలక్ష్మి

ఘనంగా అభ్యుదయ్ 2024

తార్నాక, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రమహిళా సభ స్కూల్ ఆఫ్ ఇన్ఫర్మాటిక్స్ ఎంబీఏ, బీబీఏ అనుబంధ కళాశాలల ఇంటర్ కాలేజియేట్ కల్చరల్ ఫెస్ట్‌ను పురస్కరించుకుని బుధవారం ఏఎంఎస్‌లోని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ప్రాంగాణంలో అభ్యుదయ్ 2024 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అభ్యుదయ్ 2024 కార్యక్రమంలో భాగంగా కళాశాల యాజమాన్యం విద్యార్థులకు వివిధ విభాగాల్లో పోటీలను నిర్వహించి, ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్స్‌తో పాటు, బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం హైదరాబాద్ జిల్లా యూత్ ఆఫీసర్ ఖుష్బూ గుప్తా, ఆంధ్రమహిళా సభ స్కూల్ ఆఫ్ ఇన్ఫర్మాటిక్స్ కళాశాల డైరెక్టర్ ప్రొ.కె.విజయలక్ష్మి, ఆంధ్ర మహిళాసభ ఉపాధ్యక్షుడు డా.జి.ఎల్.కే.దుర్గా, సెక్రటరీ వై.సత్యనారాయణ, డా.సీవీ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సుకన్య సమృద్ధి యోజన పథకం వినియోగించుకోవాలి : భాగ్యశ్రీ


తిరుమలగిరి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): బాలికల సంరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో ఒకటైన సుకన్య సమృద్ధి యోజన పథకంను పేదవర్గాలు వినియోగించుకోవాలని కంటోన్మెంట్ బోర్డ్ 7వ వార్డ్ మాజీ సభ్యురాలు ప్యారసాని భాగ్యశ్రీ పిలుపునిచ్చారు. పేదవర్గాల చిన్నారుల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మంచి సంక్షేమ పథకం అన్నారు. తిరుమలగిరి మలాని కాలనీకి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త సతీష్‌కుమార్ 100 మంది పేద చిన్నారుల ఖాతా ఓపన్ చేయడానికి 25వేల రూపాయలను గతంలో అందజేశారు. బుధవారం చిన్నారులకు బ్యాంక్ పాస్‌బుక్‌లను అందజేశారు. వార్డ్ 7 బీఆర్‌ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు యశ్వంత్‌కుమార్, సతీష్, వాసు, లీలా కుమారి, శకుంతల పాల్గొన్నారు.

ఆరోగ్య శిబిరంలో ఉచిత పరీక్షలు

చిలకలగూడ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఏఐఆర్ఎఫ్ సెంచనరీ ఉత్సవాలలో భాగంగా సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఈడీబీ డివిజన్, బేగంపేట్‌లోని మెడికవర్ ఆస్పత్రి సహకారంతో సికింద్రాబాద్, రైల్ నిలయంలోని పీసీఎంఈ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి హాజరైనవారికి ఈసీజీ, 2డి ఎకో, బ్లడ్‌షుగర్, బీపీ వంటి అనేక ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య సలహాలను ఇచ్చారు. ఈ శిబిరానికి ఇంటర్నల్ మెడిసిన్ డాక్టర్.రాజేష్, గుండె వైద్య నిపుణులు డాక్టర్ సాకేత్, ఆర్థోపెడిక్ డాక్టర్ సుమన్, యూరాలజిస్ట్ డాక్టర్ జ్యోతిస్వరూప్, ఆస్పత్రి జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్న ఈ వైద్య శిబిరాన్ని దాదాపుగా 350 మంది ఉద్యోగులు సద్వినియోగం చేసుకొన్నారు.

ఓటింగ్ శాతం పెంపుపై ఈసీఐ ప్రత్యేక దృష్టి

హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ప్రత్యేక దృష్టి సారించింది. ఓ వైపు స్వీప్ (సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ ప్రోగ్రామ్) ఓటు ప్రాముఖ్యతపై క్షేత్రస్థాయిలో ప్రచారం చేస్తూనే.. రైల్వేశాఖ, పెట్రోలియం సంస్థల ద్వారా కూడా విస్తృత ప్రచారం నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది.. ఈ క్రమంలో రైల్వేశాఖతోపాటు, పెట్రోలియం సంస్థలతో ఈసీఐ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సంస్థల ద్వారా చేపట్టే ఓటరు అవగాహనా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను సీఈఓ వికాస్‌రాజ్ బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. రైల్వే పెట్రోలియం సంస్థల్లో ఓటరు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రైల్వే, పెట్రోలియం సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ బహిష్కృత నాయకుడు బక్క జడ్సన్.

ప్రశ్నిస్తున్నందుకే నాపై సస్పెన్షన్ వేటు

కాంగ్రెస్ బహిష్కృత నాయకుడు బక్క జడ్సన్

పంజాగుట్ట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): 'తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత పది సంవత్సరాలపాటు జరిగిన దోపిడీపై నిరంతరం ఉద్యమించా. కాంగ్రెస్ ఐడియాలజీని పాటిస్తూ.. పూర్తిగా పార్టీ ఆర్గనైజేషన్‌కు అంకితమయ్యా. ప్రశ్నిస్తున్నందుకే నాపై సస్పెన్షన్ వేటు వేశారు' అని కాంగ్రెస్ పార్టీ బహిష్కృత నాయకుడు బక్క జడ్సన్ ఆరోపించారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు లాభం చేయడానికే రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని, బీజేపీ అత్యధిక సీట్లు గెలవాలని ఆయన కంకణం కట్టుకున్నారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కేసీఆర్ రైతులకు రైతుబంధు పథకం కింద ఇవ్వాలని పెట్టిన రూ.7వేల కోట్లను ప్రస్తుత సీఎం ఏమి చేశారని, ఇప్పటి వరకు కాంగ్రెస్ బ్యానర్ కింద చేసిన ఉద్యమాలను కొనసాగించడానికే తెలంగాణ వనరుల రక్షణ సమితిని ఏర్పాటు చేసినట్లు ఆయన ప్రకటించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తన సస్పెన్షన్, భవిష్యత్ కార్యక్రమాలపై ఆయన మాట్లాడారు. తనకు క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి వివరణ ఇవ్వాలని నోటీస్ ఇచ్చారని, ఫిర్యాదులు ఏమిటో చెప్పాలని అడిగినా.. అప్పటికే తీసుకున్న నిర్ణయం ప్రకారం తనను సస్పెండ్ చేశారన్నారు. వివిధ శాఖల్లో నిధుల దుర్వినియోగంపైన ఈడీకి, సీబీఐకి, కొందరి రాజకీయ నేతల అవినీతిపై తను చేసిన ఎన్నో ఫిర్యాదుల గురించి వివరించారు. ప్రాణభయం, రాజకీయ భవిష్యత్‌పై ఆశ వదిలేసి కల్వకుంట్ల కుటుంబంపై పోరాటం చేశానన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే ఓటు వేస్తా, వేయిస్తా అని అన్నారు. నేను ఎవరి చేతుల్లో ఆయుధం కాదన్నారు. అన్నింటిపైన ప్రశ్నిస్తున్న తనను సస్పెండ్ చేశారని, అయినా కూడా పార్టీమారే పరిస్థితి లేదన్నారు.

మాటలతో మభ్యపెట్టి.. అల్లరి చేసి బెదిరించి..

డబ్బులు డిమాండ్ చేస్తున్న మాయలేడి అరెస్టు

బౌద్ధనగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్టాండ్లు, ఇతర ప్రధాన కూడళ్ల వద్ద ప్రయాణికులను బెదిరించి డబ్బులు కాజేస్తున్న మాయలేడిని చిలకలగూడ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ అనుదీప్, ఎస్సై బాలరాజు కిషోర్, కరుణాకర్ రెడ్డి వివరాలు వెల్లడించారు.... మల్కాజిగిరి, వాణినగర్‌కు చెందిన బింగంపల్లి భాగ్య అలియాస్ అరుణ (45) సులువుగా డబ్బు సంపాదించేందుకు అడ్డదారులు ఎంచుకుంది. సికింద్రాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఆర్టీసీ బస్టాపుల్లో ఉన్నవారితో మాటలు కలిపి వ్యక్తిగత విషయాలపై ఆరా తీస్తుంది. అనంతరం వారి చేయి పట్టుకుని అల్లరి చేస్తుంది. బెదిరించి డబ్బులు వసూలు చేస్తుంది. ఈనెల 2న చిలకలగూడ, శ్రీనివాస్‌నగర్‌కు చెందిన కృష్ణన్ దక్షిణామూర్తి సికింద్రాబాద్ రెతిఫైల్ బస్టాండ్ వద్ద వేచి ఉండగా అరుణ అతనితో మాటలు కలిపింది. ఒక్కసారిగా అతని చేయి పట్టుకుని అల్లరి చేసింది. రూ.5వేలు ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఆమెను పట్టించుకోకుండా దక్షిణామూర్తి బస్సు ఎక్కగా వెంటబడింది. కేసు పెడతానని బెదిరించింది. భయపడ్డ బాధితుడు ఏటీఎం కేంద్రం నుంచి రూ.10వేలు డ్రా చేసి ఇచ్చాడు. చిరునామా తెలుసుకున్న అరుణ రెండు రోజుల తరువాత కుమార్తె విద్యాలక్ష్మితో కలిసి దక్షిణామూర్తి ఇంటికి వెళ్లింది. డబ్బు ఇవ్వాలని అతడి భార్యను డిమాండ్ చేసింది. కొన్నిరోజుల తరువాత కొంతమందిని తీసుకెళ్లి ఇంటి వద్ద అల్లరి చేసింది. వేధింపులు భరించలేక దక్షిణామూర్తి చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. బుధవారం అరుణను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. ప్రజల్ని బెదిరించి డబ్బు వసూలు చేస్తున్నట్టు వెల్లడికావడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితురాలిని పట్టుకున్న సీఐ, ఎస్సైలు, కానిస్టేబుళ్లకు ఏసీపీ జైపాల్ రెడ్డి నగదు రివార్డును ప్రకటించారు.


బింగంపల్లి అరుణ

డ్రగ్స్ విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్

16 గ్రాములు స్వాధీనం.. పరారీలో సరఫరా దారుడు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): యాంఫిటమైన్ డ్రగ్ విక్రయిస్తున్న ముగ్గురిని ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, గోల్కొండ పోలీసులు కలిసి అరెస్ట్ చేశారు. పల్నాడు జిల్లా దాచేపల్లికి చెందిన రేకపల్లి రవీంద్రబాబు అలియాస్ నోయెల్ (26), మణికొండలో ఉంటున్న ఒంగోలు వాసి షేక్ ఇస్మాయిల్ గుంటూరుకు చెందిన లీలా వెంకటేశ్వర్లు వద్ద యాంఫిటమైన్ కొనుగోలు చేసి అధిక ధరకు ఇతరులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. మణికొండకు చెందిన ఆరతుపూడి విజయ్... షేక్ ఇస్మాయిల్‌కు యాంఫిటమైన్ కొనుగోలుకు డబ్బులిచ్చి సహకరించేవాడు. వచ్చిన ఆదాయాన్ని కలిసి పంచుకునేవారు. లీలా వెంకటేశ్వర్లు నుంచి 10 గ్రాముల యాంఫిటమైన్ రూ.6వేలకు కొనుగోలు చేసి రవీంద్రబాబు సహకారంతో రూ.7వేలకు విక్రయిస్తున్నారు. వీరి దందాపై సమాచారమందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం గోల్కొండ జీషాన్ హోటల్ వద్ద దాడి చేసి పట్టుకున్నారు. వారి నుంచి రూ.1.12లక్షల విలువైన 16 గ్రాముల యాంఫిటమైన్, 3 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. లీలా వెంకటేశ్వర్లు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

4 కిలోల గంజాయి పట్టుకున్న పోలీసులు

బోరబండ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రెండు లక్షల విలువ చేసే 4 కిలోల గంజాయిని బోరబండ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. రాజ్‌నగర్‌కు చెందిన హరేంద్ర మోహన్ ఖాన్(50), ఎస్‌ఆర్‌టీ నగర్‌కి చెందిన పర్వేశ్ ఖాన్(37), సైట్-2కి చెందిన అనిల్ కుమార్ గుప్తా(40) ముగ్గురు నుంచి సుమారుగా 2 లక్షల విలువ చేసే గంజాయి స్వాధీనం చేసుకున్నారు. హరేంద్ర మోహన్ ఖాన్ ఇంట్లో దాడులు నిర్వహించిన పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు. బోరబండ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ భూపాల్ గౌడ్‌తో పాటు టాస్క్ ఫోర్స్ పోలీసులు ఈ దాడుల్లో పాల్గొన్నారు.

అల్వాల్‌లో వరుస దొంగతనాలు

● మూడు ఇళ్లల్లో చోరీ చేసిన దుండగులు
● తాళం వేసిన ఇళ్ల టార్గెట్


చోరీ చేసిన ఇంట్లో వస్తువులను చెల్లాచెదురుగా చేసిన దొంగలు


లక్ష్మీఎన్‌క్లేవ్‌లో మంగళవారం అర్ధరాత్రి దొంగతనానికి వచ్చి సీసీ కెమెరాలకు చిక్కిన దొంగలు

అల్వాల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగలు వరుస దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇళ్లల్లో ఎవ్వరూ లేని, తాళాలు వేసిన ఇళ్లనే టార్గెట్ చేస్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున మచ్చబొల్లారం లక్ష్మీ ఎన్‌క్లేవ్, హాలికా హోమ్స్‌తో పాటు వెస్ట్ వెంకటాపురం పోచమ్మ బస్తీలో ఇంటి తాళాలు పగలగొట్టి చోరీ చేసి విలువైన బంగారు ఆభరణాలతో పాటు వెండి ఆభరణాలు, ల్యాప్‌టాప్‌లను దొంగలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... లక్ష్మీ ఎన్‌క్లేవ్ ప్రాంతానికి చెందిన రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి కమర్‌ఖాన్ ఈనెల 1న ఇంటికి తాళం వేసి మలక్‌పేట్‌లో ఉండే కూతురు ఇంటికి కుటుంబసభ్యులతో కలిసి వెళ్లారు. ఆయన బుధవారం మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి ప్రధాన ద్వారం పగలగొట్టి ఉండటంతో పాటు బెడ్‌రూమ్‌లో ఉన్న బీరువాను దొంగలు తెరిచారు. బీరువాలో ఉన్న 2 తులాల బంగారు ఆభరణాలతో పాటు 30 తులాల సిల్వర్ ఆభరణాలను దొంగలించారు. దాంతో పాటు సమీపంలో ఉండే హాలికా హోమ్స్‌లోని విజయకుమార్ ఇంట్లో తాళం పగలగొట్టి లోనికి ప్రవేశించారు. ఆయన ఫ్రాన్స్ దేశంలో ఉంటున్నారు. కాగా ఆయన ఇంట్లో ఉన్న రెండు పాత ల్యాప్‌టాప్‌లను దొంగలించి దొంగలు అక్కడి నుంచి పరారయ్యారు. అదేవిధంగా వెస్ట్ వెంకటాపురం పోచమ్మబస్తీ ప్రాంతానికి చెందిన రవీందర్‌యాదవ్ డ్రైవర్‌గా ఉద్యోగం చేస్తూ అద్దె ఇంట్లో కుటుంబసభ్యులతో కలిసి నివసిస్తున్నారు. మార్చి 31న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి ఆయన బయటకు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన దొంగలు మంగళవారం రాత్రి ఇంట్లోకి చొరబడి 10 తులాల వెండి ఆభరణాలతో పాటు రూ.30 వేల నగదు, 7.5 గ్రాముల బంగారు ఆభరణాలను దోచుకుని పారిపోయారు. ఈమేరకు బుధవారం బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు డీఐ రాజేందర్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలను బాధిత కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఒకే రోజు మూడు ఇళ్లల్లో వరుస దొంగతనాలు జరగడంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురువుతున్నారు. లక్ష్మీ ఎన్‌క్లేవ్‌లో దొంగతనం కోసం వచ్చిన నలుగురు దొంగలు సీసీ ఫుటేజీలో స్పష్టంగా కనిపిస్తున్నారు.

బాలుడి అదృశ్యం


తిలక్‌రాజ్

చిక్కడపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఓ బాలుడు కనిపించకుండా పోయాడు. రాణీగంజ్ గాస్‌మండిలో నివసిస్తున్న శివానంద్ మొదటి భార్య సమత 2021లో చనిపోయింది. కుమారుడు తిలక్‌రాజ్(9)ను హాస్టల్‌లో చేర్పించాలని భావించాడు. ఈ క్రమంలో పదిహేను రోజుల నుంచి చిక్కడపల్లి వెంకటేశ్వర స్వామి దేవాలయం ప్రాంతంలో నివసించే శివానంద్ మొదటి భార్య స్నేహితురాలైన తులసి ఇంట్లో తిలక్‌రాజ్ ఉంటున్నాడు. 2వ తేదీన హాస్టల్‌లో చేర్పించడానికి అడ్మిషన్ తీసుకున్నారు. ఆరోజు ఉదయం 10.30 గంటల నుంచి తిలక్‌రాజ్ కనిపించడం లేదు. బాలుడి ఆచూకీ లభించకపోవడంతో శివానంద్ చిక్కడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పరిశోధనా ఫలాలు సగటు మనిషికి ఉపయోగపడాలి

● ప్రొఫెసర్ డి.రవీందర్

చార్మినార్ ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వైజ్ఞానిక, శాస్త్ర పరిశోధనా ఫలాలు సగటు మనిషికి ఉపయోగపడాలని ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ) వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డి.రవీందర్ అన్నారు. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్, ప్రభుత్వ సిటీ కాలేజీ భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'అడ్వాన్స్‌స్ ఇన్ ఎనర్జీ మెటీరియల్స్ అండ్ డివైజెస్' అంశంపై సిటీ కాలేజీలో నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైనది. మొదటి రోజు సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై వీసీ రవీందర్ మాట్లాడుతూ సామాజిక తత్వానికి వైజ్ఞానిక శాస్త్రాల పరిశోధనలకు మధ్య అంతర్గత సంబంధం ఉండాలన్నారు. సరికొత్త ఆలోచనలు, నూతన పరిశోధనలతో ముందుకు వచ్చే విద్యార్థులకు వర్సిటీ తరఫున ప్రోత్సాహం అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. మార్కుల కోసం కాకుండా నైపుణ్యాలను సముపార్జించుకోవడంపైనే విద్యార్థులు ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. డిగ్రీలో సైన్స్ చదువుకున్న విద్యార్థులు తమకిష్టమైన కోర్సులో పీజీ చేసే అవకాశం ఉస్మానియా వర్సిటీలో మాత్రమే ఉన్నదని, విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాతీయ, అంతర్జాతీయ సదస్సులు నిర్వహించడంలో సిటీ కళాశాల అగ్రభాగాన నిలిచిందన్న ఆయన, ఇందుకు కారణమైన ప్రిన్సిపాల్ డా.బాలభాస్కర్‌ను, సిబ్బందిని అభినందించారు. గౌరవ అతిథిగా పాల్గొన్న ఓయూ సైన్స్ విభాగం డీన్ ఆచార్య డి.కరుణాసాగర్ మాట్లాడుతూ పర్యావరణ హితమైన వైజ్ఞానిక ఆవిష్కరణలను, శక్తి సంబంధమైన సాధనాలను నూతనంగా రూపొందించుకోవాల్సిన అవసరముందన్నారు. కాలానుగుణమైన ఎనర్జీ టెక్నాలజీని విస్తృతపరుచుకోవాలన్నారు. ఏఆర్‌సీఐ అసోసియేట్ డైరెక్టర్ డా.పి.కె.జైన్ మాట్లాడుతూ పాఠ్యాంశాల ద్వారా నేర్చుకున్న పరిజ్ఞానాన్ని సామాజిక వికాసానికి ఎలా వినియోగించుకోవాలో విద్యార్థులకు శిక్షణనివ్వాలని అధ్యాపకులకు సూచించారు. సభకు అధ్యక్షత వహించిన సిటీ కళాశాల ప్రిన్సిపాల్ బాలభాస్కర్ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజం ఎదుర్కొనే సవాళ్లను అధిగమించటానికి అవసరమైన పరిశోధనలపై శాస్త్రవేత్తలు, ఆచార్యులు దృష్టి పెట్టాలన్నారు. ఐఐసీటీ సంస్థ శాస్త్రవేత్త ఆచార్య ఎం.వసుంధర, ఉస్మానియా విశ్వవిద్యాలయం భౌతికశాస్త్ర విభాగం అధ్యక్షుడు ఆచార్య ఎం.శ్రీనివాస్ విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. సదస్సు సమన్వయకర్త డాక్టర్ కె.పర్వతాలు జాతీయ సదస్సు లక్ష్యాలను వివరించారు. భౌతికశాస్త్ర విభాగం అధ్యక్షురాలు డా.నైన వినోదిని, సదస్సు సహాయ సమన్వయకర్త డా.వాసు దేవరెడ్డి, డా.చిన్ని కృష్ణ, డా.లక్ష్మీ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ డా.విప్లవదత్ శుక్ల, డా.యాదయ్య, డా.రత్నప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రచురించిన సదస్సు ప్రత్యేక సంచికను వైస్ చాన్సలర్ రవీందర్ ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ బాలభాస్కర్ అతిథులను సన్మానించారు.


సదస్సులో మాట్లాడుతున్న ఉస్మానియా యూనివర్సిటీ వీసీ రవీందర్

9న భూలక్ష్మి అమ్మదేవి సమేత మహావిష్ణువార్ల కల్యాణ మహోత్సవం

మారేడుపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పికెట్‌లోని ప్రసిద్ధిగాంచిన భూలక్ష్మి అమ్మదేవి ఆలయ ప్రాంగణంలో ఈనెల 9వ తేదీన మంగళవారం ఉదయం 10.30కు భూలక్ష్మి అమ్మదేవి సమేత మహావిష్ణువార్ల కల్యాణ మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు జెట్టి ఉమేశ్వరరావు ఏర్పాట్లు చేస్తున్నారు. అదే రోజు భూలక్ష్మి అమ్మదేవి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రోధి నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకొని ఉదయం మహాభిషేకం, శ్రీచక్ర కుంకుమార్చన, మంగళహారతి, పంచాంగ శ్రవణం, కల్యాణ మహోత్సవం, భూదేవి కథ, భూదేవి మంత్రోపదేశం, మహానైవేద్యం, మంగళహారతి, మంత్ర పుష్పం, ఉగాది పచ్చడి వితరణ, సాయంత్రం సామూహిక లలిత సహస్ర నామ స్తోత్రపారాయణ, (కుంకుమార్చన) వంటి విశేష పూజా కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందన్నారు. కల్యాణ మహోత్సవ వేడుకలను చూడడానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొంటారని ఆలయ ప్రధాన అర్చకులు ఆత్మకూరి తిరుమలేష్ ఆచార్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

టికెట్ కేటాయించని పార్టీలను తరిమికొట్టాలి

● కంటోన్మెంట్ నియోజకవర్గం మాదిగ సంఘాల నాయకులు

బోయిన్‌పల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ నియోజకవర్గానికి జరుగనున్న ఉప ఎన్నికలో మాదిగలకు టికెట్ కేటాయించని పార్టీలను ఎన్నికల ప్రచారం చేయకుండా తరిమికొట్టాలని కంటోన్మెంట్ నియోజకవర్గం మాదిగ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలోని వి అండ్ గ్రాండ్ ఫంక్షన్ హాలులో బుధవారం కంటోన్మెంట్ మాదిగల మహాగర్జన సభ వంశతిలక్, శ్రీకిషన్ మాదిగ, గోపి మాదిగ, శంకర్, అజిత్ కల్యాణ్‌ల ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ నియోజకవర్గంకు చెందిన మాదిగ సంఘాల నాయకులు, అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదిగలు ఎక్కువ సంఖ్యలో ఉన్న కంటోన్మెంట్ నియోజకవర్గానికి ఒక్కసారి కూడా మాదిగలకు టికెట్ కేటాయించకపోవడం మాదిగ జాతిని అవమానించడమేనని అన్నారు. ఈసారి పోరాడి తెచ్చుకోకపోతే మళ్ళీ ఈ అవకాశం రాదన్నారు. మాదిగలు ఐక్యంగా ఉంటూ చట్టసభల్లో అడుగుపెట్టాలన్నారు. రాబోయే కంటోన్మెంట్ ఎన్నికల్లో మాదిగ బిడ్డకే ఓటు వేసి గెలిపించుకోవాలన్నారు. మాదిగలపై చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. ఇటీవల మళ్లీ పార్టీ మారిన ఆ వ్యక్తికి రాబోయే ఎన్నికల్లో మాదిగల బలం చూపించి అతనికి టికెట్ ఇస్తే ఓడిస్తామని హెచ్చరించారు. ఏదిఏమైనా ఈసారి మాదిగలకు టికెట్ కేటాయించే వరకు ఉద్యమిస్తామని అన్నారు. ఉత్తరయ్య, రొట్టెల సునీల్, శంకర్, రాకేష్, రాజేందర్, మహేందర్, బాలు పాల్గొన్నారు.


మాదిగల సింహగర్జన సభలో మాదిగ సంఘాల నాయకులు

మాదిగలకు ఒక్క పార్లమెంట్ స్థానం కూడా కేటాయించకపోవడం దారుణం

డా. గాలి వినోద్ కుమార్



తార్నాక, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగ సామాజికవర్గానికి కాంగ్రెస్ పార్టీ ఒక్క పార్లమెంట్ స్థానాన్ని కూడా కేటాయించకపోవడం దారుణమని దళిత క్రైస్తవ దండోరా జాతీయ కన్వీనర్ డా.గాలి వినోద్ కుమార్ అన్నారు. బుధవారం తార్నాకలోని ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించి మాదిగల పట్ల కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న వైఖరిని తీవ్రంగా ఖండించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్‌లో 75 శాతం జనాభా ఉన్న మాదిగ సామాజిక వర్గానికి కాంగ్రెస్ పార్టీ ఒక్క పార్లమెంట్ స్థానాన్ని కూడా కేటాయించకుండా, ఒక్క శాతం జనభా కూడా లేని మాదిగ ఉపకులం బైండ్ల సామాజికవర్గానికి చెందిన కడియం శ్రీహరి కుటుంబానికి ప్రాధాన్యం ఇవ్వడం పట్ల మండిపడ్డారు.

మాదిగలకు ద్రోహం చేసిన కాంగ్రెస్ పార్టీకి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగ, బీసీ సామాజికవర్గానికి చెందిన ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.


జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అడిషనల్ డీజీ అభిలాష బిస్త్, పోలీస్ శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ మధుకర్ స్వామి

విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా అవగాహన కల్పించాలి

● అడిషనల్ డీజీ అభిలాష బిస్త్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ వినియోగిస్తున్న వారిలో యువత ఎక్కువగా ఉన్నారని, వారికి డ్రగ్స్ అలవాటు కాకుండా ఉండేందుకు అవగాహన కార్యక్రమాలతో పాటు చర్యలు తీసుకోవాలని అడిషనల్ డీజీ అభిలాష బిస్త్ అన్నారు. అంబర్‌పేట పోలీస్ శిక్షణ కళాశాలలో డ్రగ్స్ రహిత సమాజం అనే అంశంపై బుధవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శిక్షణ అభ్యర్థులతో డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని ప్రతిజ్ఞ చేయించారు. శిక్షణ పొందిన పోలీసులు సర్వీసులో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా ఉండేందుకు వారికి అవగాహన కల్పించాలన్నారు. పోలీస్ శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ పరవస్తు మధుకర్ స్వామి కూడా మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖన పోటీల విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డీఎస్పీ పిచ్చయ్య, డీఎస్పీలు ఉమామహేశ్వరరావు, లక్ష్మణ్, మదన్‌మోహన్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.